05-02-2021 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

## " మధురమైన పిల్లలారా - ఇక్కడ మీదంతా గుప్తము. అందువలన ఎలాంటి ఆడంబరాలు చేయరాదు. మీ నూతన రాజధాని నషాలో ఉండాలి."

**ప్రశ్న:-** శ్రేష్ఠ ధర్మము, దైవీ కర్మల స్థాపన కొరకు పిల్లలైన మీరు ఏ శ్రమ చేస్తారు ?

**జవాబు:-** ఇప్పుడు మీరు 5 వికారాలను వదిలేందుకు శ్రమ చేస్తారు. ఎందుకంటే ఈ వికారాలే అందరినీ భ్రష్టులుగా చేశాయి. ఇప్పుడు ఈ సమయంలో అందరూ దైవీ ధర్మము, కర్మల నుండి భ్రష్టులైపోయారని మీకు తెలుసు. తండ్రి వచ్చి శ్రీమతమునిచ్చి శ్రేష్ఠ ధర్మము, శ్రేష్ఠ దైవీ కర్మలను స్థాపన చేస్తారు. మీరు శ్రీమతమును అనుసరించి తండ్రి స్మృతి ద్వారా వికారాలపై విజయం పొందుతారు. చదువు ద్వారా మీకు మీరే రాజ్య తిలకాన్ని దిద్దుకుంటారు.

**పాట :- మిమ్ములను పొందుకొని మేము..... (తుమ్ హే పాకే హమ్.....)**

ఓంశాంతి. మధురాతి మధురమైన పిల్లలు ఈ పాట విన్నారు. ఆత్మిక పిల్లలు మాత్రమే " బాబా " అని అంటారు. ఈ అనంతమైన తండ్రి అనంతమైన సుఖమునిచ్చేవారు అనగా వీరు సర్వులకు తండ్రి అని పిల్లలకు తెలుసు. వారిని అనంతమైన పిల్లలందరూ అనగా ఆత్మలందరూ స్మృతి చేస్తారు. ఏదో ఒక విధంగా స్మృతి చేస్తారు కాని ఆ పరమపిత పరమాత్మ నుండి విశ్వ చక్రవర్తి పదవి లభిస్తుందని వారికి తెలియదు. తండ్రి మనకు ఇచ్చే విశ్వ చక్రవర్తి పదవి స్థిరమైనది, అఖండమైనది, అచంచలమైనది, 21 జన్మలకు స్థిరంగా ఉంటుందని మీకు తెలుసు. మొత్తం విశ్వం పై మన రాజ్యమే ఉంటుంది. దానిని ఇతరులెవ్వరూ తీసుకోలేరు, దోచుకోలేరు. మన రాజ్య పదవి స్థిరమైనది ఎందుకంటే అక్కడ ఒకే ధర్మముంటుంది. రెండవది ద్వైతము ఉండదు. అది అద్వైత రాజ్యము. పిల్లలు పాటను విన్నప్పుడల్లా తమ రాజధానిని గురించిన నషా రావాలి. ఇటువంటి పాటలు ఇంట్లో ఉండాలి. మీదంతా గుప్తము. గొప్పవారిది ఆడంబరంగా ఉంటుంది. మీకు ఏ ఆడంబరమూ లేదు. తండ్రి ఎవరిలో ప్రవేశమయ్యారో వారు ఎంత సాధారణంగా ఉన్నారో మీరు చూస్తున్నారు. ఇక్కడ ఉన్న ప్రతి మనిషి అధర్మయుక్త ఛీ-ఛీ పనులే చేస్తూ ఉన్నాడు. అందువలన ఆ మనుష్యులను తెలివిలేని వారని అంటారు. బుద్ధికి పూర్తిగా తాళము వేయబడింది. మీరు ఎంతో తెలివిగలవారిగా ఉండేవారు. విశ్వానికి అధికారులుగా ఉండేవారు. ఇప్పుడు మాయ మిమ్ములను చాలా తెలివిహీనులుగా, దేనికీ పనికిరాని వారుగా చేసేసింది. తండ్రి వద్దకు వెళ్ళేందుకు యజ్ఞ, జప-తపాలు చాలా చేస్తూ ఉంటారు. కాని వారికి ఏమీ లభించదు. ఎదురు దెబ్బలు తింటూ ఉంటారు. రోజులు గడిచిన కొలది అకళ్యాణమే జరుగుతూ ఉంటుంది. మనుష్యులు ఎంతెంత తమోప్రధానమవుతూ ఉంటారో అంతంత అకళ్యాణము జరిగే తీరాలి. ఋషులు, మునులు అని గాయనము చేయబడినవారు పవిత్రంగా ఉండేవారు. వారు నేతి-నేతి(తెలియదు తెలియదు) అనేవారు. ఇప్పుడు తమోప్రధానమైనందున శివోహమ్, తతత్వమ్, సర్వవ్యాపి, నీలో, నాలో అందరిలో ఉన్నారని అంటున్నారు. వారు కేవలం పరమాత్మ అని అంటారు. పరమపిత అని

ఎప్పుడూ అనరు. పరమపితను సర్వవ్యాపి అనడం తప్పు. అందువలన ఈశ్వరా! లేక పరమాత్మ అని అంటారు. పిత అనే పదము బుద్ధికి తోచదు. ఒకవేళ ఎవరైనా అన్నా మాటవరుసకు మాత్రమే అంటారు. పరమపితను తెలుసుకుంటే బుద్ధి ఒక్కసారిగా ప్రకాశిస్తుంది. తండ్రి స్వర్గ వారసత్వమునిస్తారు. వారు హెవెన్లీ గాడ్‌ఫాదర్, అటువంటప్పుడు మనము నరకంలో ఎందుకు పడి ఉన్నాము, ఇప్పుడు మనము ముక్తి-జీవన్ముక్తిని ఎలా పొందుకుంటాము? ఇది ఎవరి బుద్ధికీ తోచదు. ఆత్మ పతితమైపోయింది. ఆత్మ మొదట సతోప్రధానంగా, తెలివిగలదిగా ఉంటుంది. ఆ తర్వాత సతో, రజో, తమోలోకి వస్తుంది. వచ్చి తెలివిహీనమైపోతుంది. ఇప్పుడు మీకు జ్ఞానము లభించింది. బాబా మనకు స్మృతినిప్పించారు. భారతదేశము నూతన ప్రపంచంగా ఉన్నప్పుడు మన రాజ్యముండేది. ఒకే మతము, ఒకే భాష, ఒకే ధర్మము, ఒకే మహారాజ-మహారాణుల రాజ్యముండేది. తర్వాత మళ్ళీ ద్వాపరంలో వామమార్గము ప్రారంభమవుతుంది. కర్మల అనుసారంగా ఒక శరీరము వదిలి మరో శరీరము తీసుకుంటారు. ఇప్పుడు తండ్రి అంటున్నారు - నేను మీకు 21 జన్మల చక్రవర్తి పదవి లభించే కర్మలు నేర్పిస్తాను. అక్కడ కూడా హద్దు తండ్రి లభిస్తారు. కాని ఈ రాజ్య వారసత్వము అనంతమైన తండ్రి ఇచ్చిందనే జ్ఞానముండదు. మళ్ళీ ద్వాపరము నుండి రావణ రాజ్యము ప్రారంభమౌతుంది. సంబంధాలు వికారీ సంబంధాలుగా అవుతాయి. కర్మలనుసారము జన్మలు లభిస్తాయి. భారతదేశంలో పూజ్య రాజులు, పూజారి రాజులు ఇరువురూ ఉండేవారు. సత్య, త్రేతా యుగాల్లో అందరూ పూజ్యులుగా ఉంటారు. అక్కడ పూజ గాని భక్తి గాని ఉండదు. ద్వాపర యుగంలో భక్తిమార్గము ప్రారంభమైనప్పుడు యథా రాజా - రాణి తథా ప్రజా అనగా పూజారులుగా, భక్తులుగా అవుతారు. అందరికంటే గొప్ప సూర్యవంశి పూజ్యులుగా ఉన్న రాజులే పూజారీ రాజులుగా అవుతారు.

ఇప్పుడు మీరు నిర్వికారులుగా అవుతున్నారు. దాని ప్రాలబ్ధము 21 జన్మలకు ఉంటుంది. తర్వాత భక్తిమార్గము ప్రారంభమౌతుంది. దేవతలకు మందిరాలు కట్టించి పూజిస్తూ ఉంటారు. ఇది కేవలం భారతదేశములోనే జరుగుతుంది. తండ్రి వినిపించిన 84 జన్మల కథ భారతీయులకు మాత్రమే వర్తిస్తుంది. ఇతర ధర్మాల వారు తర్వాత వస్తారు. వృద్ధి అవుతూ అవుతూ అనేకమంది అవుతారు. భిన్న-భిన్న ధర్మాలవారి రూపు రేఖలలో, ప్రతి మాటలో వేరు వేరుగా ఉంటారు. పద్ధతులు, ఆచారాలు కూడా భిన్నమైపోతాయి. భక్తిమార్గానికి సామగ్రి కూడా కావాలి. బీజము చిన్నదిగా ఉన్నా, వృక్షము ఎంతో పెద్దదిగా ఉంటుంది. చెట్టు ఆకులను లెక్క పెట్టలేము. అదే విధంగా భక్తి కూడా చాలా విస్తారమైపోతుంది. లెక్కలేనన్ని శాస్త్రాలను తయారు చేస్తూ పోతారు. ఇప్పుడు తండ్రి పిల్లలతో అంటున్నారు - ఈ భక్తిమార్గపు సామగ్రి అంతా సమాప్తమైపోతుంది. ఇప్పుడు తండ్రి అయిన నన్ను ఒక్కరినే స్మృతి చేయండి. భక్తి ప్రభావము చాలా ఉంది కదా. ఇప్పుడు ఎంతో అందమైన నృత్యాలు, తమాషాలు, పాటలు మొదలైన వాటికి ఎంతో ఖర్చు చేస్తున్నారు. ఇప్పుడు తండ్రి అంటున్నారు - తండ్రి అయిన నన్ను, వారసత్వాన్ని స్మృతి చేయండి. అలాగే మన ఆది సనాతన ధర్మమును కూడా స్మృతి చేయండి. జన్మ-జన్మాంతరాలుగా మీరు భక్తి చేస్తూ వచ్చారు. సన్యాసులు కూడా ఆత్మ ఉండే స్థానమైన బ్రహ్మ తత్వమునే పరమాత్మగా భావించి, బ్రహ్మతత్వమునే

స్మృతి చేస్తారు. వాస్తవానికి సన్యాసులు సతోప్రధానంగా ఉంటే, వారు అడవికి వెళ్లి శాంతిగా ఉండాలి. అంతేకాని వారు వెళ్లి బ్రహ్మములో (బ్రహ్మ తత్వములో) లీనమవుతారని కాదు. వారు బ్రహ్మ తత్వాన్ని స్మృతి చేస్తూ శరీరము వదిలినందున బ్రహ్మములో లీనమవుతామని భావిస్తారు. తండ్రి అంటున్నారు - ఎవ్వరూ లీనమవ్వలేరు. ఆత్మ అవినాశి కదా. అది లీనము ఎలా అవుతుంది? భక్తిమార్గములో తల ఎంతగానో కొట్టుకుంటారు. భగవంతుడు ఏదో ఒక రూపంలో వస్తారని అంటారు. అయితే ఇప్పుడు రైటు ఎవరిది? మేము బ్రహ్మతత్వముతో యోగము చేసి బ్రహ్మంలో లీనమవుతామని వారంటారు. భగవంతుడు ఏదో ఒక రూపంలో పతితులను పావనంగా చేసేందుకు వస్తారని గృహస్థధర్మము వారంటారు. పై నుండి ప్రేరణ ద్వారా నేర్పించరు. టీచరు ఇంటిలో కూర్చొని ప్రేరేపిస్తారా? ప్రేరణ అనే మాటే లేదు. ప్రేరణ ద్వారా ఏ పనీ జరగదు. శంకరుని ప్రేరణ ద్వారా వినాశనమంటారు కాని అది డ్రామాలో నిశ్చితమై ఉంది. వారు ఈ ముసలము (మిసైల్స్) మొదలైనవి తయారు చేసే తీరాలి. ఇది కేవలం మహిమను గానము చేయడం. ఎవ్వరికీ వారి పెద్దల మహిమ తెలియదు. ధర్మ స్థాపకులను కూడా గురువులని అంటారు. కాని వారు కేవలం ధర్మ స్థాపన చేస్తారు. సద్గతి చేయువారిని గురువులని అంటారు. వారు ధర్మస్థాపన చేసేందుకు వస్తారు. వారి వెనుక వారి వంశావళి వస్తూ ఉంటుంది. ఎవ్వరికీ సద్గతిని ఇవ్వలేరు. కావున వారిని గురువులని ఎలా అంటారు? సర్వుల సద్గతిదాత అని ఎవరిని అంటారో వారొక్కరే గురువు. భగవంతుడైన తండ్రే వచ్చి సర్వులకు సద్గతినిస్తారు. ముక్తి-జీవన్ముక్తులను ఇస్తారు. వారి స్మృతి ఎప్పుడు కూడా ఎవ్వరూ మర్చిపోరాదు. పతిని ఎంత ప్రేమిస్తున్నా, ఓ భగవంతుడా! ఓ ఈశ్వరుడా! అని తప్పకుండా అంటారు ఎందుకంటే వారు సర్వుల సద్గతిదాత. తండ్రి కూర్చొని అర్థం చేయిస్తున్నారు - ఇదంతా రచన, నేను రచయిత అయిన తండ్రిని. అందరికి సుఖమునిచ్చేవారు ఒక్క తండ్రి మాత్రమే. సోదరుడు సోదరునికి వారసత్వమునివ్వలేరు. వారసత్వము సదా తండ్రి ద్వారానే లభిస్తుంది. బేహద్ పిల్లలైన మీ అందరికీ అనంతమైన వారసత్వమునిస్తాను. అందుకే నన్ను - ఓ పరమపితా! క్షమించండి, దయ చూపండి అని వేడుకుంటారు. కాని ఏ మాత్రము అర్థము చేసుకోరు. భక్తిమార్గంలో అనేక విధాలుగా మహిమ చేస్తారు. ఇది కూడా డ్రామానుసారము వారి పాత్రను అభినయించడమే, తండ్రి అంటున్నారు - వారు పిలిచినందున నేను రాను. ఇది తయారైన డ్రామా. డ్రామాలో నేను వచ్చే పాత్ర నిశ్చితమై ఉంది. అనేక ధర్మాల వినాశనము, ఒకే ధర్మ స్థాపన లేక కలియుగ వినాశనము, సత్యయుగ స్థాపన చేయవలసి వస్తుంది. నా సమయానికి నాకై నేనే వస్తాను. ఈ భక్తిమార్గము పాత్ర కూడా ఉంది. భక్తిమార్గపు పాత్ర పూర్తి అయినప్పుడు నేను వచ్చాను. ఇప్పుడు మేము తెలుసుకున్నాము "5 వేల సంవత్సరాల తర్వాత మళ్లీ మీతో కలుసుకున్నాము అని పిల్లలు కూడా అంటారు. బాబా కల్పక్రితము కూడా మీరు బ్రహ్మ శరీరంలో వచ్చారు అని అంటారు." ఈ జ్ఞానము ఇప్పుడు మాత్రమే మీకు లభిస్తుంది, ఆ తర్వాత మీకు ఎప్పుడూ లభించదు. ఇది జ్ఞానము, అది భక్తి. జ్ఞాన ప్రాలబ్ధము ఉన్నతయ్యే కళ. సెకెండులో జీవన్ముక్తి అంటారు. జనకునికి సెకెండులో జీవన్ముక్తి లభించిందని అంటారు కదా. రాధ అనురాధగా అవుతుందనే పదము కూడా ఉంది. జనకుడు కూడా ఈ

జ్ఞానము ద్వారా సీతకు తండ్రి అనుజనకుడుగా అవుతాడు. సీత తండ్రి అయిన జనకుడు అనుజనకుడుగా అయ్యాడు. ఇది కూడా ఒక ఉదాహరణను ఇచ్చారు. అయితే వారికి ఏ మాత్రము అర్థం కాదు. జనకుడు ఒక్క సెకెండులో జీవన్ముక్తిని పొందుకున్నాడని అంటారు. కేవలం ఒక్క జనకుడే జీవన్ముక్తిని పొందాడా? జీవన్ముక్తి అనగా జీవితాన్ని ఈ రావణ రాజ్యము నుండి ముక్తి చేసుకుంటారు.

పిల్లలందరూ ఎంత దుర్గతి పాలయ్యారో తండ్రికి తెలుసు మళ్లీ వారికి సద్గతి జరగాలి. దుర్గతి నుండి మళ్లీ ఉన్నత గతి, ముక్తి-జీవన్ముక్తిని పొందుతారు. మొదట ముక్తిలోకి వెళ్లి తర్వాత జీవన్ముక్తిలోకి వస్తారు. శాంతిధామం నుండి మళ్లీ సుఖధామంలోకి వస్తారు. ఈ చక్ర రహస్యమంతా తండ్రి అర్థం చేయించారు. మీతో పాటు ఇతర ధర్మాలు కూడా వస్తూ పోతూ ఉంటాయి. మనుష్య సృష్టి వృద్ధి చెందుతూ ఉంటుంది. తండ్రి అంటున్నారు - ఈ సమయంలో మానవ సృష్టి రూపి వృక్షము తమోప్రధానమై శిథిలమైపోయింది. ఆదిసనాతన దేవీదేవతా ధర్మము యొక్క పునాది పూర్తిగా శిథిలమైపోయింది. మిగిలిన ధర్మాలన్నీ అలాగే ఉన్నాయి. భారతదేశంలో ఒక్కరు కూడా స్వయాన్ని ఆది సనాతన దేవీదేవతా ధర్మానికి చెందినవారమని భావించరు. దేవతా ధర్మమువారే. కాని ఈ సమయంలో మేము ఆదిసనాతన దేవీ దేవతా ధర్మము వారిగా ఉండేవారమని భావించరు. ఎందుకంటే దేవతలు పవిత్రంగా ఉండేవారు. మేము పవిత్రంగా లేము అని వారికి తెలుసు. అపవిత్రులైన మేము స్వయాన్ని దేవతలమని ఎలా పిలిపించుకోవాలి. హిందూ ధర్మమని పిలిపించుకోవడం కూడా డ్రామా ప్లాను అనుసారము ఆచారమైపోతుంది. జనాభా లెక్కలలో కూడా హిందూ ధర్మమని వ్రాస్తారు. గుజరాతువారు అయినా హిందు గుజరాతి అని అంటారు. హిందూ ధర్మము ఎక్కడ నుండి వచ్చింది? అని అడిగితే ఎవ్వరికీ తెలియదు కనుక ఎవ్వరూ జవాబు చెప్పరు. మా ధర్మాన్ని కృష్ణుడు స్థాపించాడని మాత్రము చెప్తారు. ఎప్పుడు? ద్వాపరములో. ద్వాపరము నుండే మీరు తమ ధర్మమును మరచి హిందువులని పిలిపించుకొనుట ప్రారంభమయింది. అందుకే వారిని దైవీ ధర్మ భ్రష్టులని అంటారు. అక్కడ అందరూ మంచి కర్మలు చేస్తారు. ఇక్కడ అందరూ ఛీ-ఛీ కర్మలు చేస్తారు. అందువలన దేవీదేవతా ధర్మము భ్రష్టము, వారి కర్మ భ్రష్టము అని అంటారు. మళ్లీ శ్రేష్ఠ ధర్మము, శ్రేష్ఠ దైవీ కర్మ స్థాపనౌతూ ఉంది. అందుకే ఈ పంచ వికారాలను వదులుతూ ఉండండి అని చెప్పబడ్తూ ఉంది. మీ వికారాలు అర్ధకల్పము నుండి ఉన్నాయి. ఇప్పుడు ఈ ఒక్క జన్మలో వదిలేయాలి - ఇందులోనే శ్రమ కలుగుతుంది. శ్రమ పడకుండా విశ్వ చక్రవర్తిత్వ పదవి ఎలా లభిస్తుంది? తండ్రిని స్మృతి చేసినప్పుడే స్వయానికి మీరు రాజ్యతిలకాన్ని దిద్దుకుంటారు అనగా రాజ్య పదవికి అధికారులుగా అవుతారు. ఎంత బాగా స్మృతిలో చేస్తారో, శ్రీమతమును అనుసరిస్తారో, అంత రాజాధి-రాజులుగా అవుతారు. చదివించే టీచరు చదివించేందుకు వచ్చారు. ఇది మనుష్యుల నుండి దేవతలుగా తయారు చేసే పాఠశాల. నరుని నుండి నారాయణునిగా అయ్యే కథను వినిపిస్తున్నారు. ఈ కథ చాలా ప్రసిద్ధి గాంచింది. దీనిని అమర కథ, సత్యనారాయణ కథ, తీజరీ కథ అని కూడా అంటారు. మూడింటి అర్థము తండ్రి తెలియజేస్తున్నారు. భక్తిమార్గంలో అనేక కథలున్నాయి. పాట ఎంత

బాగుందో చూడండి. బాబా మనలను మొత్తం విశ్వానికి అధికారులుగా చేస్తున్నారు. దానిని ఎవ్వరూ దోచుకోలేరు. మంచిది.

మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము :-

1. సదా ఇది స్మృతిలో ఉండాలి - మనము ఒకే మతము, ఒకే రాజ్యము, ఒకే ధర్మ స్థాపనకు నిమిత్తము. అందువలన ఐక్యతతో ఒకే మతమును అనుసరిస్తూ ఉండాలి.
2. స్వయం రాజ్యతిలకము దిద్దుకునేందుకు వికారాలను వదిలే శ్రమ చేయాలి. చదువు పై పూర్తి గమనమివ్వాలి.

## వరదానము :- " త్రికాలదర్శి స్థితి ద్వారా మాయ యొక్క దాడి నుండి సురక్షితంగా ఉండే అతీంద్రియ సుఖానికి అధికారీ భవ "

సంగమ యుగములోని విశేష వరదానం లేక బ్రాహ్మణ జీవితము యొక్క విశేషత - అతీంద్రియ సుఖము. ఈ అనుభవము వేరే ఏ ఇతర యుగములో జరగదు. కాని ఈ సుఖాన్ని అనుభవం చేసేందుకు త్రికాలదర్శి స్థితి ద్వారా మాయ చేసే దాడి నుండి సురక్షితంగా ఉండండి. ఒకవేళ మాటిమాటికి మాయ దాడి జరుగుతూ ఉంటే కావాలనుకున్నా అతీంద్రియ సుఖాన్ని అనుభవం చేయలేరు. ఎవరైతే అతీంద్రియ సుఖాన్ని అనుభవం చేస్తారో వారిని ఇంద్రియ సుఖాలు ఆకర్షించలేవు. నాలెడ్జ్‌ఫుల్‌గా ఉన్న కారణంగా వారికి ఇంద్రియ సుఖాలు తుచ్ఛమైనవిగా కనిపిస్తాయి.

## స్లోగన్:- " కర్మణా సేవ మరియు మనసా సేవల బ్యాలెన్స్ ఉంటే శక్తిశాలి వాయుమండలాన్ని తయారు చేయగలరు. "